

# చిన్నూ ప్రపంచంలోకి....

## రాజా సమీరనందన్

కారు పార్కు చేసి తలుపు తీయగానే "నాన్నా...." అంటూ వచ్చి వాటేసుకున్నాడు చిన్ను. "ఏం నాన్నా... ఇంకా పడుకోలేదా ?" అన్న నా ప్రశ్నకి సమాధానం చెప్పకుండానే "నా కోసం ఏమి తెచ్చావు?" అని నా వైపు ఆశగా చూస్తూ నిలబడ్డాడు. "అరెరె... ఏమీ తేలేదు కన్నా. ఆఫీసులో లేటుగా బయల్దేరే సరికి దారిలో షాపులన్నీ మూసేసారు. సారీ రా చిన్ని తండ్రీ." అని బుజ్జగించా. వాడి నిరాశ నిండిన ముఖాన్నిచూసి నన్ను నేను నిందించు కున్నా. ఏమీ తీసుకురానందుకు. "మీరు వస్తారని ఎదురు చూస్తూ పడుకుండి పోయాడు బాబు. మీ కారు శబ్దం విని ఒక్క ఉదుటున లేచి పరుగెత్తుకొచ్చాడు. "వివరం చెప్పింది వెనకాలే వచ్చిన శైలజ. "పడుకో నాన్న. చాలా లేటు అయ్యింది" అని వాడిని ఎత్తుకుని ముద్దు ఇచ్చేసరికి జాబిల్లిలా విప్పారింది వాడి మొహం. "నువ్వు అన్నం తినేవరకూ ఉంటా" అన్నాడు. "ఆఫీసులో మీటింగ్ జరిగింది. తరువాత అక్కడే మాకు డిన్నర్ పెట్టారు. నేను తినేసా. నీతో పాటు నేను కూడా పడుకోవడమే, శైలజా ! వీడిని పడుకోబెట్టు, నేను రిఫ్రెష్ అయ్యి వస్తా" అని బెడ్‌రూము లోకి దారి తీసా. వెంట వచ్చి నేను బట్టలు మార్చుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళడం చూసి మంచం ఎక్కాడు చిన్నుగాడు. వాడిని పడుకోబెట్టడానికి సిద్ధం అయ్యింది శైలజ.

✿ ✿ ✿

నేను, నా భార్య శ్వేత ఇద్దరం రెండు పెద్ద పెద్ద ఎం.ఎన్.సి.లలో మేనేజర్లుగా చేస్తున్నాం హైదరాబాదులో. శ్వేత తన కంపెనీలో సిటీ మొత్తానికి ఫైనాన్స్ హెడ్. నేను నా కంపెనీలో హెచ్ ఆర్ హెడ్. ఇంజనీరింగ్ కాంపస్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యి, చదువు పూర్తికాగానే, ఉద్యోగంలో చేరిపోయాం. చిన్న వయసు. పెద్దజీతం. ఎవ్వరి డిపెండెన్సీ నా మీద లేని జీవితం. చూపించే దానికి రెట్టింపు పని గంటలు, పనిలో చిన్న తేడా వచ్చినా, మేనేజర్ల చేతిలో జీతం కన్నా ఎక్కువ తిట్లు. వెరసి ఎటూ తీసుకువెళ్ళని, ఎక్కడకూ అక్కరకు రాని జీవితం అన్నమాట. అల్లాంటి ఒక తిట్ల పర్వంలోనే కలిసింది శ్వేత. మొదట కాంటీన్‌లో కనిపించినా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు మా ప్రాజెక్ట్‌లోనే ఇంకో మోడ్యూల్ నుంచి మా మోడ్యూల్‌కి వచ్చింది. నాతో పాటు తిట్లలో భాగస్వామ్యం తీసుకుంది. మొదట్లో తిట్లు తిని తరువాత అవి తలుచుకుని బాధపడే వాళ్ళం. రాను రాను కాఫీ బ్రేక్స్‌లో అవి ఎంటర్‌టైన్ మెంట్ అంశాలు. తరువాత లంచ్‌లు, డిన్నర్‌లు, ఔటింగ్‌లు, డేట్‌లు, తెరిసేలోపు రెండేళ్ళు గడిచి పోయాయి. పెళ్ళి చేసుకుందామనుకున్నాం. కానీ ఇద్దరిదీ కలిపినా పదిలక్షల చిల్లర మాత్రమే ఉన్న మా ప్యాకేజ్‌లు సరిపోవు అని "ఎం.బి.ఎ" వైపు దండయాత్ర నడిపాం. నా కన్నా తెలివైనది అయిన కారణం చేత శ్వేతకి ఐ.ఐ.ఎం.బి లోనూ, నాకు హెచ్.ఆర్.ఎం అంటే ప్రీతివల్ల నేను ఎక్స్.ఎల్ ఆర్.ఐ లోనూ పడ్డాం. ఐదేళ్ళకోర్సు రెండేళ్ళలో పూర్తి చేసి పట్టభద్రులమయ్యేలోపే ఒక్కొరికీ మూడేసిఉద్యోగాలు. వాటిల్లో ముప్పైఐదు లక్షలు వచ్చే ఉద్యోగంలో శ్వేత, ఇరవై అయిదు లక్షల ఉద్యోగంలో నేను చేరిపోయాం. పనిగంటలు ఎక్కువ కనుక శ్వేతకి ఎక్కువ జీతం అని ఒక సెల్ఫ్ ఎక్స్‌ప్లనేషన్. అప్పటికి ఇద్దరికీ ఇరవైఆరు సంవత్సరాలు నిండాయి. ఉద్యోగంలో చేరిన సంవత్సరమే పెద్దలు అతి తీవ్ర ఆనందంతో, ఆకాశం అంత పందిరి కింది, వజ్రాలు దొరకలేదేమో, ముత్యాల పెళ్ళి జరిపించారు. వాళ్ళ డూటీ వాళ్ళు చేసేసిన ఫీలింగుతో తృప్తిపడిపోయారు.

పెళ్ళి తరువాత హైదరాబాదులో కోటిన్నర పెట్టి, కె.పి.హెచ్.బి దగ్గర ఒక గ్రేటెడ్ కమ్యూనిటీలో డూప్లెక్స్ ఇల్లు తీసుకున్నాం. శ్వేత ఒక హోండా సివిక్ నేను ఒక టొయోటా ప్రాడో కొనుక్కున్నాం. రెండు పూటలా వంట వండిపెట్టి వెళ్ళడానికి వంటావిడ, ఏమన్నా పనులు చేసి పెట్టడానికి కమ్యూనిటీ వర్కర్స్. ఇంటినిండా రకరకాల ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్. లేటెస్ట్ ఫెసిలిటీస్. సెంట్రలైజ్డ్ ఎసి. కానీ ఇంట్లోతక్కువ ఆఫీసులో ఎక్కువ. అంచేత ఇల్లు చెక్కు చెదిరేది కాదు. శ్వేతది ఇరవైనాలుగు గంటల్లో ముప్పై గంటలు పనిచేసే ఉద్యోగం. నాది ఇరవై మంది చేసేది ఐదుగురి చేత చేయించే ఉద్యోగం. ఎప్పుడో ఒక రాత్రివేళ మెలకువ వచ్చి ఒకరి పక్కన మరొకరు ఉంటే మాట్లాడుకోవడం. జీవితం మొత్తం ఆఫీసులకి అంకితం చేసేసాం. సరిగా మాట్లాడుకుని రెండు మూడు నెలలు అవుతోందని గమనించి, ప్రతినెలా ఖచ్చితంగా ఒక సెలవురోజు కలిసి గడపాలి అని తీర్మానించుకున్నాం. అలా ఒక రెండేళ్ళు గడిచేసరికి పెద్దలు మనవడో మనవరాలో కావాలని అల్లరి చేసేసరికి గుర్తొచ్చిందా విషయం.

మళ్ళీ ఇంకో కొత్త వ్యక్తి వస్తే డబ్బులు అవసరం అని హుటాహుటిన కంపెనీలు మారి, కోటి రూపాయలకు దగ్గరగా సంవత్సర ఆదాయం తీసుకువెళ్ళి తెప్ప తగలేసినా ఏరు దాటాలన్న కాన్సెప్ట్ విధంగా ఇంకో సంవత్సరం పని చేశాం. తరువాత సంవత్సరం చిన్నుగాడు ఆరంగేట్రం. వాడి శరణ్ అని ఒక సినిమా హీరో పేరుకి దగ్గరగా పేరుపెట్టి చిన్నుగా చలామణి చేసాం. రెండు నెలల తరువాత వాడిని వాళ్ళ అమ్మమ్మ బామ్మ తాతయ్యలకి అలవాటు చేసి తిరిగి ఆఫీసుదారి పట్టాం ఇద్దరం. మొదటిరెండు పుట్టిన రోజులూ ఆకాశంలో జరిపి తరువాత అత్తయ్యగారు ఊరినుంచి పంపిస్తే, వాడి ఆలనాపాలనా చూడటానికి పన్నెండేళ్ళ శైలజని పెట్టాం. అందరం సంతోషం, అంతా మంచే, అని ఆనందపడ్డాం.

✿ ✿ ✿

స్నానం చేసి వచ్చేసరికి చిన్ను ఇంకా పడుకోలేదు "అమ్మ ఇవ్వాళ నాకు ఫోను చెయ్యలేదు నాన్న" అని ఎన్ 73 చూపిస్తూ ఫిర్యాదు చేసాడు. "ఏదన్నా బిజీ పనిలో ఉందేమో" అని సర్దిచెప్ప చూసా. శ్వేత ఆన్‌సైట్ ఎస్సైన్‌మెంట్ మీద ఇంగ్లండ్ వెళ్లింది. ఇద్దరికి ఒకేసారి అవకాశాలు వచ్చాయి. కానీ శ్వేత వెళ్తేనే మిగులు ఎక్కువ అని లెక్క కట్టి నేను మరోసారికి వాయిదా వేసుకున్నా. "ఇవ్వాళ ఆఫీసులో ఏం చేసావు?" మళ్ళీ చిన్ను. "పడుకో నాన్నా. బాగా రాత్రి అయ్యింది ఇంక నేను కూడా పడుకుంటా" అని ఒకసారి మెయిల్ చెక్ చేసుకుందా మని లాప్‌టాప్ తెరిచా. ఇంటర్నెట్ సర్ఫ్ ప్లగ్ కోసం వెతుకుతూ ఉంటే "ఏదన్నా కథ చెప్పవా" అని అడిగాడు. "బాగా లేట్ అయ్యింది. లేటు అయితే మంచిది కాదు. పడుకో ఇంక" అని చిన్నుమీద విసుక్కున్నా. "మరి నువ్వు రోజూ లేటుగానే పడుకుంటావుగా" అని కన్‌సర్న్డ్‌గా అడిగాడు. "పడుకో యింక. నేను నీ కన్నా పెద్దవాణ్ణిలే" అని కసిరితే కిక్కురు మనకుండా పడుకున్నాడు. ఒక గంట అటూ ఇటూ మెయిల్స్ అవీ చూసి నేను కూడా పడుకున్నా. రెండు అయ్యి నట్టుంది అప్పటికి.

మూడింటికి అనుకుంటా. శ్వేత ఫోను వచ్చింది. ఇంగ్లండు నుంచి "హేమీరా ! పడు కున్నావా? నీకో గుడ్‌న్యూస్. మా కంపెనీకి అరవై మిలియన్ పౌన్ల డీల్ ఒకటి కుదిర్చిపెట్టా. మనకి ఒక టూ పర్సెంట్ ఇస్తారు అందులో. లేటైనా నీకు ఈ న్యూస్ చెబుదామని చేసా. నేను ఇంకొక మూడు వారాల్లో వచ్చేస్తున్నా" అంది. "అదేంటి వచ్చే



ఆంధ్ర సారస్వత సమితి, బందరులో 29-7-2008న 'రావిశాస్త్రి సాహిత్యం'పై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఎమ్.శివరామకృష్ణప్రసాద్, కొట్టిరామారావు (సమన్వయకర్త), డా॥ బోయిన వెంకటేశ్వరరావు ఐ.ఎ.ఎస్, డా॥ శ్రీకృష్ణ. డా॥ మాదిరాజు, ఎల్.ఎస్.శాస్త్రి, దొండపాటి దేవదాసు, పి.కుమార్‌లు పాల్గొన్నారు.

సోమవారం రావాలిగా అని ప్రశ్నించా. "డీల్ కుదిరింది కదా ! ఫార్మాలిటీస్ అవి పూర్తి చేసుకుని వచ్చేసరికి లేటు అవుతుంది. చిన్నూ ఎలా ఉన్నాడు? వాడితో రేపు మాటాడుతా అనిచెప్పు, ఇంక ఉంటా" అని ఫోన్ పెట్టబోతూ ఉంటే "శ్వేత కంగ్రాట్యులేషన్స్ మై డియర్. దట్స్ ఏ స్ప్లెండిడ్ జాబ్. ఐ లవ్‌యూ" అని అన్నా. "లవ్ యూ టూ" అని ముగించింది.

శ్వేత ఇండియాకి వచ్చి నెలరోజుల వరకూ డీల్‌లో బిజీగా ఉంది, నా ఆఫీసు పనిలో నేను, చిన్ను గాడితో శైలజ, జీవితం మళ్ళీ వేగవంతం. ఆంగ్లంలో ఆన్ ఫాస్ట్ ట్రాక్. తరువాత నాలుగు నెలల్లో చాలా చిత్రంగా మార్పు వస్తుంది మాలో అన్నది ఊహించలేదు. మేథమేటిక్స్‌లో వన్ ఎయిటీ డిగ్రీస్ టర్న్. ఇంగ్లీష్‌లో 'యు' టర్న్

✿ ✿ ✿

మొట్టమొదట మార్పు వచ్చింది శ్వేతలో. అమ్మ కావడం వల్ల. నా కన్నా తెలివైనది జ్ఞానవంతురాలూ కావడం వల్ల కామోసు. శ్వేత ఇండియా వచ్చిన రెండు నెలలకి చిన్నుకి జ్వరం వచ్చింది. మూడు వారాల పాటు నూట రెండు తగ్గలేదు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో శైలజకి చెప్పి ఎవరి ఆఫీసులకి వారు వెళ్ళిపోయాం. శైలజే డాక్టరుకి చూపించడం మందులు వెయ్యడం వంటి విషయాలు చూసుకుంది. మొదటి రెండువారాలూ, మూడోవారం మాత్రం క్రమ విరుద్ధంగా శ్వేత ఆఫీసుకి శెలవుపెట్టి ఇంట్లో ఉండిపోయింది. నేను యధాప్రకారం ఆఫీసుకి వెళ్ళిపోయినా ఆశ్చర్యచకితుడిని మాత్రం అయ్యా. అక్కడనుంచి శ్వేతలో మార్పు రోజుకి కనీసం పద్దెనిమిది గంటలో ఆఫీసులో ఉండే తను ఆ సమయాన్ని క్రమంగా ఎనిమిది గంటలకు పట్టుకు వచ్చేసింది. ఇది గమనించడానికి నాకు రెండు నెలలు పట్టింది. అప్పట్లో ఒక రోజు ఆఫీసులో ఉండగా ఫోను చేసి నీతో మాట్లాడాలి అని అంది. ఆ మాట్లాడుకోవడానికి కూడా రెండువారాల తరువాత వీలు పడింది. అదీ కాకతాళీయంగా.

ఆ సాయంత్రం నేను ఏదో మీటింగ్‌కి బొంబాయి వెళ్ళాల్సి ఉంది. ఫ్లైట్ కాన్సిల్ అయ్యి మీటింగ్ కూడా కాన్సిల్ అయ్యింది. త్వరగా ఇంటికి వచ్చేసా. ఇంట్లో అడుగు పెట్టేసరికి చిన్నుగాడు బొమ్మలు గీస్తున్నాడు. ఏదో ఆవుబొమ్మ లాగుంది. నా చిన్నప్పటి ఫోటోల్లోంచి చూసి గీస్తున్నాడు. అప్పట్లో ఇంటి పక్కన ఉన్న పశువుల కొట్టం దగ్గర తీయించుకున్న ఫోటో. అప్రయత్నంగా అది చూడగానే ఆవు – పులికథ గుర్తొచ్చింది. చిన్నప్పుడు ఆ కథ వినగానే వెక్కి వెక్కి ఏడ్చిన విషయం తలుచుకుని కళ్ళు చెమర్చాయి. ఒక్క ఉదుటున వెళ్ళి చిన్నుగాడిని వాటేసుకున్నా ఆ అసందర్భ ప్రేమ ప్రకటనకి వాడు మొదట కంగారు పడినా తరువాత రెట్టించిన ఆనందంతో అక్కున చేరాడు. ఇంతలో శ్వేత కూడా వచ్చింది. ఏదో మార్పు. పేరుకి తగ్గట్టు నిర్మలంగా ఉంది ఆమె. ఎందుకో చాలా హాయి అనిపించింది. సాయంత్రం చాలా ఆనందంగా గడిచింది. చిన్నూ నేనూ బొమ్మలు వేసుకుంటూ ఉంటే శ్వేత వంట వండింది. పెళ్ళైన కొత్తల్లోనో. తరువాత మరెప్పుడో గుర్తులేదు. ఆమె చేతి వంట తిన్నది. తరువాత అందరం ఆరు బయట కూర్చుని పాటలు పాడుకున్నాం. చిన్నుగాడు నా వళ్ళో పడుకుని నిద్ర పోయాడు. ఉద్యోగంలో చేరినప్పుడు శ్వేతతో కలిసి గడిపిన సాయంత్రాలు గుర్తుకు వచ్చాయి. ఏదో తెలియని బెంగ. చిన్నుని లోపలికి తీసుకువెళ్ళి పడుకోబెట్టి, నిద్రకి ఉపక్రమిస్తూ శ్వేతతో అన్నా" నీతో గడిపిన సాయంత్రాలు గుర్తు వచ్చాయి ఇవ్వాళ" అని ఆనందంతో సిగ్గుతో నన్ను వాటేసుకుంది.

ఆ ఆనందం ఆస్వాదిస్తూ ఉండగా నా చేతులకు తడిగా తగిలింది శ్వేత ముఖం. చూస్తే ఆగకుండా కన్నీరు. కారణం తెలియకపోయినా సముదాయించడానికి ప్రయత్నం చేసా కొంచం సేపటికి తేరుకుని "నీతో మాట్లాడాలి. హాల్లోకి రా. ఇక్కడ అయితే చిన్ను లేస్తాడు" అని దారితీసింది. వెంట నడిచి నలభైఅయిదువేల రూపాయల లేజ్ ఛాయ్ కుర్చీలో చతికిలబడ్డా. సరాసరి వచ్చి నా వడిలో కూర్చుంది. నా కళ్ళల్లోకి కళ్ళు పెట్టి చూస్తా అంది "మీరా ! నేను కొన్నాళ్ళు ఉద్యోగం మానేద్దామనుకుంటున్నా". ఆమె కళ్ళలోని లోతులు అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉన్న నాకు మొదట్లో ఆ మాటలు అర్థం కాలేదు. విషయం తలకి ఎక్కేసరికి ఉలిక్కిపడ్డా. డోంట్ బి ఫూలిష్. ఎందుకిలాంటి డెషిషన్ తీసుకున్నావు". "గుర్తుందా రెండు నెలల క్రితం చిన్నూకి జ్వరం వచ్చింది. అప్పుడు వారం శెలవు పెట్టా. ఆ తరువాత డెలిబరేట్‌గా నా ఆఫీస్ వర్కింగ్ అవర్స్ తగ్గించుకున్నా" అని చెప్పింది. "హే! లీవ్ తీసుకున్నప్పుడు కొంత సర్‌ప్రైజ్ అయ్యా. కానీ తరువాత అంతగా పట్టించుకోలేదు." అన్నా "అవును, చాలా రోజుల నుంచీ మాట్లాడుదాము అనుకున్నా. ఇవ్వాల్టికి దొరికావు అది కూడా లక్కీగా ఐ లవ్ యూ" అని ఎమోషనల్‌గా ఒకముద్దు ఇచ్చింది. "లవ్ యూ టూ" అని ముద్దుతో సమాధానం ఇచ్చి "ఏమైందిరా ! అని అడిగా. "ఎన్నాళ్ళైంది ఇలా పిలిచి నన్ను" అని చెప్పడం మొదలు పెట్టింది.

"చిన్నూకి జ్వరం వచ్చినప్పుడు ఇద్దరం ఆఫీసుకి వెళ్ళిపోయాం. శైలజ ఒక్కతే చూసుకుంది. ఈ రోజు నీకు ఫ్లైట్ కాన్సల్ అయ్యినట్టు అప్పట్లోనాకు కూడా ఫ్లైట్ కాన్సల్ అయ్యి ఇంటికి వచ్చేసా. రాగానే చిన్నూ ఇంకా జ్వరంతో ఉన్నాడని శైలజ చెప్తే వెళ్ళి వాడి దగ్గర కూర్చున్నా. కొంతసేపటికి కళ్ళు తెరిచి ఎప్పుడు వచ్చావు? మళ్ళీ వెళ్ళిపోతావా? అని అడిగాడు రేపటి దాకా ఎటూ వెళ్ళనని చెప్పి ఆ సాయంత్రం అలా వాడితోనే ఉన్నా. రాత్రి కూడా వాడి పక్కనే పడుకున్నా. ఒక రాత్రి వేళ ఎందుకో మెలకువ వచ్చి చూస్తే వాడు నోట్లో వేలు వేసుకుని నన్నే చూస్తూ ఉన్నాడు. ఏమయ్యిందిరా అని అడిగా. నిన్ను చూసి చాలా రోజులు అయ్యింది. మళ్ళీ రేపు పొద్దున్న వెళ్ళిపోతావు. అందుకే చూస్తున్నా అన్నాడు. వాడి మాటలకు నాకు నోట మాట రాలేదు. పొద్దున లేవగానే ఆఫీస్‌కి ఫోను చేసి నేను రావటం లేదు అని చెప్పేసా. తరువాత రోజంతా వాడితోనే ఉంటా అని చిన్నుకి తెలిసినపుడు వాడి మొహంలో ఆనందం చూసి నా కళ్ళనీళ్ళు ఆగలేదు. వెంటనే ఒక వారం సెలవు పెట్టేసా. ఏమన్నా ఇష్యూస్ ఉంటే ఫోన్‌లోనే రిసాల్వ్ చేసా !" నా కళ్ళమ్మట నీళ్ళు ఆగటం లేదు. ఎప్పుడు మొదలయ్యాయో కూడా తెలీదు. "అసలు ఎందుకు మనం ఇంతపని చేస్తున్నాం చెప్పు. సుఖంగా ఉండాలని డబ్బులు సంపాదించడం మొదలు పెట్టి, ఇప్పుడు డబ్బుల కోసం సుఖాలనే కాక సంసారాలు, పిల్లలు కూడా వదిలేసుకుంటున్నాం. ఇదివరకు ఎంత సెన్సిటివ్‌గా ఉండేవాడివి ఇప్పుడు నేను ఉద్యోగం మానేస్తా అంటే ఫూలిష్ అన్నావు.ఒకసారి పాత మీర లాగ ఆలోచించు మీర" అని శ్వేత అనేసరికి నా కన్నీరు తారాస్థాయికి చేరుకుంది. ఎప్పుడూ నన్ను అలా చూడని శ్వేత మొదట బిత్తర పోయినా తరువాత అర్థం చేసుకుని ఊరుకోబెట్టింది." నిజంగా నువ్వు నా జీవితంలో ఉండటం నా అదృష్టం. అంటూ ఉంటాను కదా నువ్వు నా కన్నా తెలివైన దానివి అని. నిజంగా నీ విజ్‌డమ్‌కి సెల్యూట్. నీకు ఏమి చెయ్యాలనిపిస్తే అది చెయ్యి. నా ఫుల్ సపోర్ట్ నీకే. నీకు, మనకి ఏ లోటూ లేకుండా చూసుకునే బాధ్యత నాది" అని ప్రామిస్ చేసా.

చిన్నప్పుడు ఆవు – పులి కథ విని, దూడకి పాలు ఇచ్చి వస్తా అని ఆవు పులిని బతిమాలితే తట్టుకోలేక ఏడిచేసా. మళ్ళీ దూడకి అమ్మ ఎక్కడ నుంచి వస్తుంది. "పాలు ఎవరు ఇస్తారు అని కానీ నాకు తెలియకుండా నేనే ఉద్యోగం, డబ్బు సంపాదన, వస్తువులు అని రకరకాల రీతిలో నాలోనే ఒక పులిని తయారు చేసుకున్నా. కోట్లు వేలల్లాగ, నెలలు రోజుల్లాగా మార్చేసి నాలోని ఆ పులి, ఆవులాంటి నా స్వభావం మీద అవకాశం తీసుకుంది. నాకు తెలియని ఆ బెంగ ఏమిటో ఇన్నాళ్ళకి అర్థం అయ్యింది. పొద్దున లేవగానే ఆఫీస్‌కి శెలవుపెట్టాలని నిర్ణయించుకుని, చిన్న పిల్లాడిలా శ్వేత పక్కనే ఉండిపోయా. నాలోని పులికి ఆవుని వదిలెయ్యమని విన్నపం చేసుకుంటూ.